# అంకితం

వంశీ పుస్తకం రాశాడు.

అది ఓ ప్రేమకావ్యం. ఆ పుస్తకాన్ని తన ప్రేయసికి అంకిత మిచ్చాడు. మొదటి పేజీలో ఆ అమ్మాయి ఫోటోవేసి–ఆమె విశాలనేత్రాలు మాత్రమే కనిపించేటట్లు వేయించి–ఆ క్రింద 'శిల చలించేదెప్పుడో? నా కల ఫలించేదెప్పుడో??'– ఆమెకు – ప్రేమతో 'వంశీ'– అని అందంగా అచ్చొత్తించాడు.

వంశీ బి. యస్సీ ఫైనలియర్ చదువుతున్న విద్యార్థి. ప్రతిమ అతని క్లాస్‌మేట్, అందాల బొమ్మ. ఆమె అంటే వంశీకి ఆరాధన. 'కాలేజీ బ్యూటీ' అయిన ప్రతిమ చారడేసి కళ్ళను చాలామంది గుర్తుపట్టారు. అందుకే ఆ పుస్తకం సంచలనం సృష్టించింది.

గుసగుసలు కాస్తా కాలేజీలో రణగొణ ధ్వనులుగా పరిణమించాయి. నిజానికి వంశీ అల్లరి చిల్లర వాడేంకాదు; పుస్తకాల పురుగు. తన చదువేదో తనేదో?? మరెందుకిలా జరిగింది???

అమ్మాయిలందరూ ప్రతిమను బాగా ఏడిపించారు "నువ్వు శిలవా?? కలవా?"

"నీ అజ్ఞాత ప్రేమికుడు చూడవే ఎంత పని చేశాడో??"

"ఆ ప్రేమ పూజారికి నీ ఎదుటపడే ధైర్యంలేక నీ మీద కవిత్వం రాస్తాడా? పుస్తకంచేసి నీకే అంకితమిస్తాడా??"

నీ కళ్ళు నిజంగా అంత బావుంటాయా? ఇన్నాళ్ళూ మేము గమనించనే లేదే?? ఏవీ? తెరువ్! చూడనీ ఆ అందాల్ని?? చూడనీ ఆ వెలుగుల్ని?"

ప్రతిమ కోపంతో దహించుకుపోయింది. తోక తొక్కిన నాగు పామయింది.

వెంటనే వెళ్ళి, ఆ పుస్తక ప్రతిని ప్రిన్సిపాల్ గారికిచ్చి, వంశీపై పిర్యాదు చేసింది

ప్రిన్సిపాల్ వంశీని పిలిపించాడు.

సంజాయిషీ అడిగాడు.

"సార్ ప్రతి కవికీ ఒక ప్రేరణ అవసరం. అలాగే ఈ పుస్తకం రాసేందుకు ప్రేరణనిచ్చిన నాయికకు నేను అంకితమిచ్చాను అది 'తప్పు' అని నేను అనుకోవడం లేదు." అని తొణకకుండా సమాధానం చెప్పాడు వంశీ.

"తప్పొప్పులను చెప్పవలసింది నువ్వు కాదు ప్రతిమ నీపై రిపోర్ట్ చేసింది. విచారించవలసిన బాధ్యత నాకుంది. మూడు సంవత్సరాల నుండి ఈ కాలేజీలో చదువుతున్న నీ మీద ఒక్క కంప్లయింట్ లేదు. పైగా ఇంటలిజెంట్ స్టూడెంటువి అభివృద్ధిలోకి రావలసిన వాడివి, అందుకే నీకో అవకాశం యిస్తున్నాను. 'తప్పు'ను ఒప్పుకొని, క్షమాపణ పత్రం రాసి, ఒక కాపీ ఆ అమ్మాయికి, ఒక కాపీ నాకూ యివ్వాలి. రేపటి లోపల ఈ పని చెయ్యకపోతే, నిన్ను కాలేజీనుంచి సస్పెండ్ చేయవలసి వస్తుంది. దట్సాల్ యు కెన్ గో?" అని చెప్పి, మారు మాట్లాడేందుకు అవకాశం యివ్వకుండా వెళ్ళిపొమ్మన్నాడు ప్రిన్సిపాల్.

* * *

దూరంగావున్న నేస్తాలను కలుసుకునేందుకు—పచ్చికలో నెమ్మదిగా అడుగులు వేసికుంటూ, ఆలోచిస్తూ నడుస్తున్న ప్రతిమను వడివడిగా వెళ్ళి కలుసుకున్నాడు వంశీ—

"ప్రిన్సిపాల్ కెందుకు రిపోర్ట్ చేశారు?"

ఆగి వెనుదిరిగి చూసి, కళ్ళు దించుకుంది ప్రతిమ.

"మీరు చేసింది తప్పా, కాదా?" అన్నది.

"మీ పట్ల నేనెప్పుడైనా అలా ప్రవర్తించానా?"

అతని స్వరంలో నిజాయితీ వుంది.

"లేదు"

"మరి?"

"అలా పుస్తకంలో నన్ను"

"ఆ స్వేచ్ఛకూడా నాకు లేదంటారా?"

"అంటే?" ఆమె కళ్ళు రెపరెపలాడాయి.

"ప్రతిమా! నిజం మిమ్మల్ని మొట్టమొదట చూచినప్పటినుండీ ప్రేమిస్తున్నమాట వాస్తవం కానీ, అది నాగుండెల్లో దాచుకున్నాను. అక్కడే మిమ్మల్ని పూజించాను. నా భావాలన్నీ అలా పుస్తకం రూపంలో తెచ్చుకున్నాను. పుస్తకంలో ఆ కళ్ళు మీవే! మీరే! నా కావ్య కథా నాయిక మీరే!! అందుకే పుస్తకాన్ని మీకే అంకితమిచ్చాను అలా చేయడం తప్పంటారా? అందాన్ని ఆరాధించడం, గుండెల్లో భద్రపరచుకోవడం నేరమంటారా?? అందగత్తెలు-ఆ అందాన్ని పొగిడితే ఓర్చుకునే శక్తి కూడా కలిగివుండాలి. తాంబూల సేవనంలో పెదవి పండితేనే కదా అందం? గోరింటాకు పాదాల్లో, చేతుల్లో ఊరితేనే కదా ఆనందం?"

ఆమె బేలగా ఓ మారు చూసి, మళ్ళీ కళ్ళు దించుకుంది.

"ప్రతిమా! ఒక్క విషయం. ఈ కాలేజీలో నా మీద ఎలాంటి రిమార్క్‌లేదు ఇంతవరకు. ఇది ఒక్కటే! ఇదీ తప్పని నేననుకోవడంలేదు. అందుకని నేను క్షమాపణ పత్రం రాసి యిచ్చే ప్రసక్తిలేదు అవసరమైతే కాలేజీ వదిలి వెళ్ళిపోతాను లేదంటే క్షమాపణ పత్రం ఎలా రాయాలో, మీదృష్టిలో నేను చేసిన తప్పులు ఏమిటో అన్నీ రాసి మీరు తీసుకువస్తే-నేను సంతకం పెడతాను. అదీ మీ తృప్తికోసం, దేనికైనా రేపు యిదే చోట మీకోసం ఎదురు చూస్తూ వుంటాను" అని చెప్పి వేగంగా వెళ్ళిపోయాడు వంశీ.

ప్రతిమ ప్రతిమలా అలాగే నిలుచుండి పోయింది— పోతున్న అతనివంక చూస్తూ—

* * *

"వంశీ!"

నిన్న మీరు నన్ను కలిసి, నా ఎదను కదిలించి వెళ్ళినప్పటి నుండీ ఆలోచిస్తూనే వున్నాను. రాత్రంతా నిదుర పోకుండా ఆలోచించాను క్షమాపణపత్రం ఎలా రాయాలి అని—

ఊహు!.... మీరు రాయగలిగినంత వేగంగా, సూటిగా చేనెలా రాయగలను— ఆడపిల్లను?

మథనపడి చివరకు ఓ నిర్ణయానికి వచ్చాను. ఇన్నేళ్ళూ మీలో నన్ను దాచుకుని, ప్రేమించినందుకు కృతజ్ఞురాలిని. ప్రేమను తెలుసుకోలేక మిమ్మల్ని రచ్చకెక్కించినందుకు క్షంతవ్యురాలిని. పుస్తకాన్ని మీరు నాకు అంకితమిచ్చారు. నేను మీకు అంకితం అవుతున్నాను. ఉంటాను.

మీ
ప్రతిమ"

-నిన్న ఎక్కడ కలుసుకున్నాడో – అప్పటినుంచీ ఎదురుచూస్తూ అక్కడే అలాగే నిలుచుని వున్నాడు అనిపించింది ప్రతిమకు పక్కమీద ప్రభాత సూర్యునిలా దర్శనమిచ్చిన వంశీని చూసి—

కాళ్ళు కొంచం తడబడుతున్నాయి ప్రతిమకు, వంశీకి దగ్గరవుతున్నకొద్ది

కళ్ళు పైకెత్తలేక పోతోంది.

అందమంతా నడిచివచ్చి, హృదయాన్ని దోసిట్లో పెట్టినట్టు—ఆ ఉత్తరాన్ని వంశీ చేతుల్లో వుంచి- వెనుదిరిగి- బిరబిరా ప్రిన్సిపాల్ గది వైపు వెళ్ళిపోయింది ప్రతిమ

లేఖ విప్పి, చూసుకున్న వంశీకి మొదట కనిపించింది— లేఖ చివర "మీ ప్రతిమ" అన్న అక్షరాలు, ఆ ప్రక్కనే తడి ఆరిన ఓ కన్నీటిచుక్క!

వంశీ ఉత్తుంగతతరంగమయ్యాడు!

చుట్టూ ప్రతిమలే!!

❋